# సత్యవాక్కు

# The Word of Truth

క్రైస్తవ మాసపత్రిక

OCTOBER 1997

# సంక్షిప్త వార్తలు

1997 సెప్టెంబరు 9వ తేదీ రాత్రి పెద్దాపురం మండలం పాతనాయకం పల్లిలో జరిగిన సువార్తకూటములో సోదరులు జాషువాగూటం గారు, T.ch.ఫ్లెమింగ్స్ గారు పాల్గొని వాక్యపరిచర్యచేసిరి. ఆ గ్రామములోను, పరిసర గ్రామముల లోను సోదరలు టి. ఆనందరావ్ గారు క్రీస్తుకొరకు పనిచేయుచున్నారు. పాతనాయకంపల్లిలో యున్న సంఘముకొరకు ప్రార్థించండి.

సెప్టెంబరు 17వ తేదీ బుధవారం అమలాపురం మండలంలో యున్న వాడపర్రు గ్రామములో చక్కటి బహిరంగ సభ జరిగెను. ఆ గ్రామములో యున్న క్రీస్తు సంఘస్థులు నిర్మించుకొనిన తాత్కాలిక ఆరాధన స్థలము ఆరోజు ప్రతిష్టింప బడెను. సోదరులు పాల్‌గూటం గారు, జాషువాగూటం గారు వాక్యపరిచర్య చేసిరి. సోదరులు E.K.V. ప్రసాద్, బూలయోహాను, నేటీ సెయింట్‌లు మరియు పలువురు సువార్తికులు ఆనాటి కూటములో పాల్గొనిరి. వాడపర్రులో సోదరులు D.రంగారావ్ గారు క్రీస్తుకొరకు పనిచేయుచున్నారు. పాల్‌గూటం గారు, రంగారావ్‌గారు మరియు మరికొంతమంది సువార్తికులు ఆ ప్రాంతములో గొప్ప పనిచేయుచున్నారు.

సెప్టెంబరు 22వ తేదీ సోమవారం నాడు పాత గుంటూరులోని క్రీస్తుసంఘము తమ 22వ వార్షికోత్సవమును జరుపుకొనిరి, ఆ సాయంకాలము జరిగిన సభకు వందలాది స్త్రీ పురుషులు. పిల్లలు హాజరై ప్రభువుని స్తుతించిరి. 22 సంవత్సరముల క్రితము సోదరులు యల్లమాటి ప్రభుదాస్ గారు తమ ప్రభుత్వోద్యోగమునకు రాజీనామా చేసి పాత గుంటూరులో ఇద్దరి సభ్యులతో పరిచర్య మొదలిడిరి. ఇప్పుడాయన పరిచర్యవలన గుంటూరు జిల్లాలో కనీసం పది స్థానిక సంఘము లేర్పడుటయే గాక, పాత గుంటూరులోని సంఘము దినదినాభివృద్ధి నొందుచున్నది.

పాత గుంటూరు సంఘము యొక్క 22వ వార్షికోత్సవ సందర్భముగా సోదరులు జాషువాగూటం గారు సతీసమేతముగా హాజరై, వాక్యపరిచర్య చేసిరి. ఆనాటి సభకు సోదరులు యల్లమాటి ప్రభుదాస్ గారు అధ్యక్షత వహించగా, సోదరులు P.W.D. మిల్టన్ గారు సంఘ రిపోర్టును చదివి వినిపించిరి. ప్రభుదాస్

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

Phone : 0884-63722

**Editor :** **J.C.CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 18 | అక్టోబరు 1997 | సంచిక 3

### సంపాద కీయం

## మనము ఆరాధనకు యేమి తీసికొని రావాలి ?

### ( What we should Bring to Worship? )

దేవుడు సృష్టికర్త. మనము ఆయన [illegible]. మనము దేవుండ్లము కాదు గాని ఆయన స్వరూపమందు చేయబడిన వారము. ఆయన మనలో తన జీవపు ఊపిరిని ఊదగా మనము జీవించు ఆత్మయై యున్నాము. ఆయనదైన ఆత్మీయ స్వరూపాన్ని ఆయన మనకిచ్చారు. అందువలన మన ఆత్మకూడ అమర్త్యమైనది. గనుక మనము ఆయనను ఆరాధించాలి, ఘన పరచాలి, మన దేవుడని సృష్టికర్తయని అంగీకరించాలి.

యాకోబు బావిదగ్గర యేసు సమరయ స్త్రీని కలిసికొనినప్పుడు ఆ స్త్రీ "అయ్యా నీవు ప్రవక్తవని గ్రహించుచున్నాను. మా పితరులు ఈ పర్వతమందు ఆరాధించిరి గాని, ఆరాధింపవలసిన స్థలము యెరూషలేములో ఉన్నదని మీరు చెప్పుదురని ఆయనతో అనగా యేసు ఆమెతో ఇట్లనెను: అమ్మా ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమందు ఈ పర్వతము మీదనైనను, యెరూషలేములోనైనను

మీరు తండ్రిని ఆరాధింపరు. నా మాటనమ్ముము; మీరు మీకు తెలియని దానిని ఆరాధించువారు, మేము మాకు తెలిసిన దానిని ఆరాధించువారము; రక్షణ యూదులలో నుండియే కలుగుచున్నది. అయితే యధార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించుకాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చేయున్నది. తన్ను ఆరాధించువారు అట్టి వారే కావలెనని తండ్రి కోరుచున్నాడు. దేవుడు ఆత్మగనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెననెను. ఆ స్త్రీ ఆయనతో-క్రీస్తనబడిన మెస్సీయ వచ్చునని నేనెరుగుదును; ఆయన వచ్చినప్పుడు మాకు సమస్తమును తెలియ జేయునని చెప్పగా- యేసు నీతో మాటలాడుచున్న నేనే ఆయనని ఆమెతో చెప్పెను" (యోహాను 4:19-26).

యూదులు కాని వారితో యూదులకుగల వైవాహిక బంధము వలన కలిగిన ప్రజలే సమరయులు. అందువలన వారు వెలివేయబడిన వారై ఒక స్థానిక కొండ యొద్ద ఆరాధన చేసుకొనుచుండిరి. యెరూషలేములో దేవాలయమున్నదని, యూదులు అక్కడ ఆరాధన చేయుదురని ఈ స్త్రీ యెరుగును. అయితే యెరూషలేములోను, లేక అక్కడయున్న (సమరయుల) పర్వతము మీదను గాక ప్రజలు ఎక్కడ ఉన్నా అక్కడ ఆరాధన చేసుకొనే సమయం ఆసన్నమైనదని యేసు ఆమెకు చెప్పెను. నిజానికి దేవుడు సత్యారాధికులను, అనగా ఆత్మతోను సత్యముతోను ఆరాధించు వారిని వెదకుచున్నారని యేసు ఆమెకు తెలియజెప్పెను.

అందువలన నేడు మనం ఆరాధించుచున్నాము. దేవుని వాక్యాన్ని పఠించుట కొరకు ప్రతి ఆదివారం కూడుకొందుము, ప్రార్థన చేతుము, పాటలు పాడుదుము, ప్రభురాత్రి భోజనంలో పాలు పొందుదుము మరియు కానుకలిచ్చెదము (అపొ.కా. 20:7; 2తిమో 2:15; అపొ.కా. 2:42; ఎఫెసీ 5:19; 1కొరింథీ 16:2). మనం ఆదివారమున సంఘముగా కూడి వచ్చుటకున్న ఏకైక కారణం ఆరాధన. అయితే యిదిగాక వేరే కారణాల వలన కూడుకొనుట విచారము. కొందరు అలవాటు చొప్పున హాజరవుతారు, కొందరు తమ మిత్రులను కలిసికొనుటకు మరికొందరు బోధకుని సంతోషపెట్టుటకు హాజరవుతారు. కొందరు యౌవనస్థులు తమ

తలిదండ్రుల ఒత్తిడి మేరకు హాజరవుతారు. ఇట్టి కారణాల వలన ఆరాధనకు హాజరగువారు పరలోకపు తండ్రి తమ కొరకు దాచి యుంచిన ఆశీర్వాదములను పోగొట్టుకొందురు.

మనం ఆయన చిత్తప్రకారము ఆరాధించిన యెడల ఆయన మనతో యుందునని, మనలను దీవింతునని వాగ్దానము చేసెను. ఆ దీవెనలను మనం పొందాలంటే ప్రతి ఆదివారం మనతో కొన్నిటిని ఆరాధనకు తీసికొని రావాలి. దిగువ సంగతులు ఆలోచించుము:

1. దేవుని ఆరాధించడానికి పవిత్ర హృదయాన్ని మనం తీసికొని వెళ్లాలి. మనం దేవుని బిడ్డలము, క్రీస్తు రక్తములో కడుగబడిన వారము. మన పాపములు క్షమించబడియున్నవి. గనుక మనము మాట చేతగాని క్రియచేతగాని యేమిచేసినా దేవుని చిత్తప్రకారము చేయుటకు ఎంచుకోవాలి. యోహాను ఇట్లు చెప్పాడు: "అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1యోహాను 1:7).

2. మనం విధేయత కలిగి రావాలి. మనం మనుష్యులను గాని, లేదా మనలను మనమే సంతోషపరచుటకు గాక, దేవుని ఉపదేశమునకు లోబడుచు రావాలి. మనం ఏదో ఒక ఆచారకర్మలో పాలుపుచ్చుకొనుటకు గాక ఆరాధనలోని ప్రతి అంశమును గూర్చి దేవుడు నిర్దేశించిన దానిని గ్రహించుచు జరిగించువారమై యుండాలి (మత్తయి 7:21).

3. మన ఆరాధన హృదయంలోనుండి వచ్చునదై యుండాలి. మనం యేమి చేయుచున్నామో దానిపై మనస్సునుంచాలి. మరియు ప్రతి అంశములోను నిష్కాపట్యాన్ని కనుబరచాలి. మనం విలాసం కొరకు, ఉల్లాసం కొరకు ఆరాధించుటకు రాలేదు. గాని మనం చేయునదంతా దేవుని కిష్టపూర్వకమై యుండుటకు మన మనస్సంతటినీ దానిలో లగ్నము చేయాలి (యోహాను 4:24).

4. మనం దేవుని యెడల భయభక్తులు కలిగియుండాలి, మరియు ఆరాధన యంతటిలోను భయభక్తులు కలిగియుండాలి. మన ఆరాధనమూర్తి స్తుతికి పాత్రుడు పరలోకమందున్న దేవుడేయని గ్రహించుకోవాలి. ఆయనను మనం అగౌరవ పరచకూడదు (కీర్తన 111:9).

5. మనం దీనమనస్సు కలిగియుండాలి. మనుష్యులకు కనబడాలని, వారి మెప్పు పొందాలని మనం ఆరాధనకు వెళ్లుటలేదు. సరిగదా దేవుని యెదుట సాగిలపడి ఆయననే ఘనపరచుటకు ఆరాధనకు వెళ్లుచున్నామని మనం గ్రహించుకోవాలి (మత్తయి 5:5).

6. మనము మంచి మాదిరిని నెలకొల్పుటకు ఆరాధనకు వెళ్లుదుము. యితరులు మనలను గమనించుచున్నారు. మన పిల్లలు, మిత్రులు, తోటిక్రైస్తవులు, వగయిరా ప్రజలు మనలను గమనించుచున్నారు. మనము సంఘారాధన లకు క్రమముగా వెళ్లుచు హృదయపూర్వకముగా దేవుని ఆరాధించాలి (అపొ.కా. 2:42).

7. మనము ప్రేమను, క్షమాపణను, హెచ్చరికను, సహవాసమును ఒండొరులతో కలిగియుండాలి. తోటి సోదర సోదరీలతో కలిసి మనము ఒకే కుటుంబమై యున్నాము. క్రీస్తునందు ఏకమై యున్నాము. మనం రక్షింపబడిన వారము. మనకు నిరీక్షణ యున్నది. మనం ఆరాధించడానికి, కృతజ్ఞత కలిగి యుండడానికి ఎంతోయున్నది (1కొరింథీ 12:13).

మనం దేవుని సమీపించడానికి ఈ విధంగా సిద్ధపడియుంటే మన ఆరాధన ఆత్మతోను, సత్యముతోను యుండును. మన ఆరాధన ఆయనకు అంగీకారమగును. మరియు అట్టి ఆరాధన యొక్క ప్రతిఫలమును తప్పక పొందుదుము.

# ప్రార్థన
## ( Prayer )

ప్రార్థనలో శక్తి యున్నదని ప్రతి క్రైస్తవుడు తెలిసికొనాలి. దేవుడు మానవుల ప్రార్థనల కెట్లు జవాబునిస్తాడో మనకు తెలియకపోయినను దానిలో యున్న శక్తిని మాత్రం మనం గ్రహించాలి. ప్రార్థనలవలన క్రీస్తువైపు ఎంతమంది మార్చబడ్డారో మనకు తెలియకపోవచ్చు. ప్రార్థనలవలన మనకు కలుగబోవు అపాయములు ఎన్ని తప్పించబడ్డాయో తెలియకపోవచ్చు. ప్రార్థన వలన మన పిల్లలకు తలిదండ్రులకు బంధువులకు మనం యిచ్చే నడిపింపు మనకు తెలియకపోవచ్చు. ప్రార్థనవలన ఇంకా ఎన్నెన్ని జరిగినవో లేక జరుగలేదో మనకు తెలియకపోవచ్చు. గాని ఒకటి మాత్రం ఖచ్చితం-ప్రార్థనలో శక్తి యున్నది. ప్రార్థనలో శక్తి యున్నదని బైబిలు చెప్పుచున్నది గనుక అది సత్యం.

క్రైస్తవుల ఆరాధన ప్రార్థన లేకుండ సంపూర్తికాదు. ప్రార్థన ఆరాధనలో ఒక భాగమై యున్నది. ఆదిమ క్రైస్తవులు ప్రార్థన చేయుట యందు ఎడతెగక యుండిరని బైబిలు చెప్పుచున్నది (అపొ.కా. 2:42).

మనము ప్రార్థన ఎందుకు చేయాలో బైబిలు మనకు అనేక కారణాలను చూపించుచున్నది. ఆత్మీయ జీవితంలో ఘనులైనవారు ప్రార్థనాపరులు. గనుక మనము కూడ ప్రార్థించాలి. ఉదాహరణకు: ఏలియా మనవంటి స్వభావము గల మనుష్యుడే. అతడు ఆసక్తితో ప్రార్థన చేస్తే మూడున్నర సంవత్సరముల వరకు భూమిమీద వర్షింపలేదు. అతడు మరల ప్రార్థన చేస్తే ఆకాశము వర్షమిచ్చెను, భూమి తన ఫలము ఇచ్చెనని యాకోబు 5:17లో మనం చదువగలం. పాతనిబంధన కాలంలో ప్రార్థన జీవితం వలన దానియేలు దేవునికి సన్నిహితంగా జీవించాడు. యేసుప్రభువు తరచు ప్రార్థించేవారు. ఆయన ప్రార్థించుచు రాత్రి అంతా గడిపినట్లు లూకా 6:12లో మనం చదువగలం. మన ప్రభువు ప్రార్థనాపరులు.

పౌలు కూడా తరుచు ప్రార్థించేవాడు. దేవుని యెదుట రాత్రింబగళ్లు మీకొరకు ప్రార్థించుట మానక యున్నానని అతడు తన పత్రికలలో తెలియజేసేవాడు. పౌలు వ్రాసిన పత్రికలన్నింటిలోను ప్రార్థనను గూర్చి అతడు చెప్పాడు. ఆనాటి క్రైస్తవులు శోధన కాలములలో జీవించుచున్నారని అతడెరుగును. వారికొరకు అతడు ప్రార్థించేవాడు. తన స్వజాతీయులైన ఇశ్రాయేలీయుల కొరకు అతడు ప్రార్థించేవాడు (రోమా 10:1). బైబిలులో మనకు కనబడే ఘనులు ప్రార్థనాపరులు.

## ఆరాధనలో ఒక భాగం

ఆదిమ సంఘారాధనలో ప్రార్థన ఒక భాగంగా యుండేది: యెరూషలేములో సంఘము స్థాపింపబడగానే వారు ప్రార్థనయందు ఎడతెగక యుండేవారని లేఖనాల్లో తెలియజేయబడింది. "వారు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుటయందును ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి" యని అపొ.కా. 2:42లో వ్రాయబడియున్నది. యెరూషలేము క్రీస్తు సంఘముయొక్క ఆరాధనలో ప్రార్థన ఒక భాగంగా యుండేది.

## ప్రార్థనా శక్తి

అపొ.కా. 12వ అధ్యాయములో రాజైన హేరోదు సంఘాన్ని బాధపెట్టుట మనం చూస్తాము. యాకోబును అతడు ఖడ్గముతో చంపించాడు. తరువాత పేతురును కూడ చెరసాలలో వేయించాడు. సంఘమయితే అతనికొరకు అత్యాసక్తితో దేవునికి ప్రార్థన చేయుచుండెను" (అపొ.కా. 12:25). వారి ప్రార్థన ఫలితంగా పేతురు అద్భుతరీతిగా విడుదల చేయబడెను. సంఘము సభ్యుల ప్రార్థనలవలన నిర్మించబడతాది. సంఘము యొక్క ఆత్మీయాభివృద్ధి కొరకు ప్రార్థన అతి ప్రాముఖ్యమైనది. యేసుప్రభువు ఒకసారి "దేవాలయములో ప్రవేశించి క్రయవిక్రయములు చేయువారి నందరిని వెళ్ళగొట్టి, రూకలు మార్చువారి బల్లలను గువ్వలమ్ము వారి పీఠములను పడద్రోసి, నా మందిరము ప్రార్థనమందిర మనబడును అని వ్రాయబడియున్నది. అయితే మీరు దానిని దొంగల గుహగా చేసెడి వారనెను" (మత్తయి 21:12-13). దేవుని సంఘము ప్రార్థనమందిరము.

## ఎవరెవరిని గూర్చి ప్రార్థించాలి ?

మనము ప్రార్థించవలసిన అంశములను గూర్చి బైబిలు ఎక్కువ చెప్పుచున్నది. దేవుని ప్రజలు ఎక్కడున్నను, ఏమి చేయుచున్నను వారిని గూర్చి మనము ప్రార్థించాలి.

ప్రతి స్థానిక సంఘములో యున్న దేవుని ప్రజలందరి కొరకు పౌలు ప్రార్థించేవాడు. క్రైస్తవ జీవితాన్ని జీవించువారు నిరుత్సాహపడడం జరుగుతాది. మనం ఎదుర్కొనుచున్న సమస్యలు ఎంత పెద్దగా కనబడతాయంటే, వాటివలన దేవుని మరచిపోతాం. దేవుని చిత్తాన్ని జరిగించడానికి అవుసరమైన అంతర్యశక్తిని మనం ఏలాగైనా సంపాదించాలి. దూరప్రాంతములలో సువార్త ప్రకటించుచున్న వారికి మన ప్రార్థన సహాయం అందించాలి. వారు తమ పనిలో ముందుకు సాగునట్లు దేవుడు శక్తిని, సహాయాన్ని అందించేలా మనం ప్రార్థించాలి. దేవుని ప్రజలు ఒండొరుల కొరకు ప్రార్థించాలి.

యితరులను గూర్చి ప్రార్థించడమేగాక, మనం మనకొరకు కూడ ప్రార్థించాలి. దీనిలో స్వార్థం కనబడుతున్నా, నిజానికి అందులో స్వార్థంలేదు. అపొ.కా. 8వ అధ్యాయములో సీమోనను వాడు పేతురు యోహానుల దగ్గర ధనముంచి పరిశుద్ధాత్మ వలన, అద్భుతములు చేసే శక్తిని కొనాలనుకొన్నాడు. ఆ శక్తి తనకుంటే త్వరలో ధనికుడనై పోతానని బహుశ సీమోను ఊహించాడు. అయితే "నీ హృదయము దేవుని యెదుట సరియైనది కాదు.... కాబట్టి యీ నీ చెడుతనము మానుకొని మారుమనస్సు నొంది ప్రభువును వేడుకొనుము" అని పేతురు అతనికి చెప్పాడు (అపొ.కా. 8:20-22).

ప్రతిరోజు ప్రభువు కోరేవిధంగా మనము జీవించులాగున ప్రార్థించాలి. మనం దిన దినం చేయుచున్న పాపములు క్షమించుమని దేవుని అడగాలి. నిన్నటి కంటె ఈరోజు దేవునికి మరింత సన్నిహితంగా జీవిస్తానని మనం దేవునికి వాగ్దానం చేయాలి, అట్లు జీవించాలి. దేవుడు కోరుచున్న విధంగా జీవించాలంటే మనకు దొరికే ఆత్మీయ సమయాన్నంతటి కొరకు ప్రయత్నించాలి. దేవుని సహాయం

కొరకు అడగాలి. మనకొరకు మనం ప్రార్థించాలి.

ప్రతి క్రైస్తవుడు తన స్వదేశముకొరకు ప్రార్థించాలి "మనము సంపూర్ణ భక్తియు మాన్యతయు కలిగి నెమ్మదిగాను సుఖముగాను బ్రదుకు నిమిత్తము అన్నిటికంటె ముఖ్యముగా మనుష్యలందరికొరకును రాజులకొరకును అధికారులందరి కొరకును విజ్ఞాపనములును ప్రార్థనలును యాచనలును కృతజ్ఞతా స్తుతులును చేయవలెనని హెచ్చరించుచున్నాని" అపో.పౌలు 1తిమో 2:1,2లో వ్రాసాడు. ఆదిమ క్రైస్తవులు తమ్మును పాలించువారు చేయుచున్న వాటన్నిటితోను ఏకీభవించలేదు. అయినను వారికొరకు ప్రార్థించేవారు. మనదేశం కొరకు, దేశనాయకుల కొరకు భారతదేశంలో యున్న ప్రతి క్రైస్తవుడు తప్పక ప్రార్థించాలి. దేశనాయకులు గైకొను నిర్ణయాలు సువార్తకు అభ్యంతరముగా యుండకుండుటకు మనం తప్పక వారికొరకు ప్రార్థించాలి. భారతదేశ క్రైస్తవులు ప్రార్థనాపరులు. వారిని బట్టి ఈదేశం ఇంకా అభివృద్ధి జెందేలాగున దేవుని ఆశీర్వాదముల కొరకు మనం ప్రార్థించాలి.

సంఘాభివృద్ధికొరకు మనం తీవ్రంగా ప్రార్థించాలి. సాధారణంగా తీవ్రంగా ప్రార్థించేవారే తీవ్రంగా కృషి చేస్తారు. అట్లయినప్పుడు దేవుడు మన ప్రార్థనలకు త్వరగా జవాబిచ్చాడని మనం అనుకోవడం జరుగుతాది. సంఘాభివృద్ధి కొరకు ప్రార్థన చేస్తూ, ఏవిధమైన పని చేయకపోతే ఫలితం శూన్యం. సంఘ పెద్దలకొరకు, సంఘ సభ్యులకొరకు, వాక్యపరిచర్య చేయువారి కొరకు మనం తప్పక ప్రార్థిస్తూ యుండాలి. మనం ప్రార్థించాలి, దేవుని పనికొరకు తప్పక కానుకలియ్యాలి.

## దేవునికి అర్పించుకోవాలి

అన్నిటికంటె ముఖ్యంగా, మిమ్మును మీరు దేవునికి అర్పించుకోవాలి. నీవు నీ జీవితాన్ని, నీ హృదయాన్ని, నీ ఆత్మను దేవునికియ్యాలి. యేసుప్రభువు దేవుని కుమారుడని నమ్మి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, యేసే దేవుని కుమారుడని ఒప్పుకొని పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందాలి. అట్లు ప్రభువుకు, ఆయన సువార్తకు లోబడాలి. దేవుని బిడ్డవైన తరువాత ఆయనను

నాయనా, తండ్రీ అనే హక్కును నీవు కలిగియుంటావు. ఆయన మన ప్రార్థనల నాలకించే దేవుడు. మన అవుసరాలన్నిటినీ ఎరిగినవాడు, వాటిని తీర్చగలవాడు. "కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును" (మత్తయి 6:33).

- జాషువా గూటం.

## బైబిలు గ్రంథము

### ( The Bible )

లోకంలో బైబిలు గ్రంధము గూర్చి భిన్నాభి ప్రాయములున్నవి. ఈ గ్రంధమును వ్యతిరేకించేవారు దీనిపై పందెము కాయువారు. దీనిని పట్టించుకొనని వారు కూడ ఉన్నారు. యెహోయాకీము వలె దీనిని కాల్చినవారున్నారు. దావీదు వలె దానిని ప్రేమించి ధ్యానించేవారున్నారు (యిర్మియా 36:23; కీర్తన 119:97).

ఏది ఏమైనను బైబిలు అతి పవిత్రగ్రంథము. అది భక్తిని, గౌరవమును, ప్రేమను, విధేయతను, విశ్వాసమును మనకు నేర్పించుచున్నది. బైబిలు లేకపోతే నిత్యత్వమును గురించిన నిరీక్షణ, ఈలోకంలో మనలను నడిపించుమార్గదర్శి లేకుండా నశించిపోవుదుము. బైబిలును బట్టియే క్రీస్తు రక్తమును, ఆయన బలియాగమును, మన పాపప్రాయశ్చిత్తమును దేవుడు మన పక్షముగ జరిగించెనని తెలియబడుచున్నది.

బైబిలు అను మాట దాని పుటలలో ఎక్కడ కనబడదు. దేవుని గ్రంథం ఒక ధర్మశాస్త్రం (కీర్త 119:97; యాకోబు 1:25). అది దేవుని వాక్యము (కీర్త 119:11). సత్యవాక్కు (2తిమో 2:15).

బైబిలు వాక్యము జీవముగలది. శక్తిగలది (హెబ్రీ 4:12). దేవుని మాటచేత ప్రపంచములును ఆకాశములును కలిగెను (హెబ్రీ 11:3; కీర్తన 33:6). అది రక్షించును (అపొ.కా. 11:14; యాకోబు 1:21). మరియు తీర్పు దినమున తీర్పు

తీర్చును (యోహాను 12:48). కాబట్టి ఈ భూలోకమునుండి పరలోకము తీసుకొనివెళ్ళే శక్తివంతమైన దేవుని వాక్యమే బైబిలు.

ఇది మనుష్యుల వలన కల్గినది కాదు (2తిమో 3:16,17; 1కొరింథీ 2:10-13). ఇది యదార్థం (కీర్తన 19:7). ఇది ఎల్లప్పుడు ఉండును (మత్తయి 24:35; 1పేతురు 1:24-25). మనుష్యులు వ్రాసిన పుస్తకములు కొద్దికాలం నిలిచియుండ వచ్చును. అవి పడిపోవచ్చును గాని బైబిలు మాత్రం ఎపుడు నిలిచియే యుండును.

ప్రతి సంత్సరములోను అధికముగ అమ్మబడుచున్న గ్రంధమది. కోట్లాది ప్రజలు దీనిని నమ్మి విశ్వసించుచున్నారు. దానికి వేలకొలది సంవత్సరముల కాలం గడిచినను ప్రస్తుత ప్రజలకు ఇది క్రొత్తగ ఉన్నది. అది దేవుని వాక్యం గనుక శాశ్వతముగ నిలుచును. దానిని చదివి ధ్యానించే వాడు ధన్యుడు. "యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు. అతడు నీటికాలువల యోరను నాటబడినదై ఆకువాడక తనకాలమందుఫలమిచ్చు చెట్టువలె యుండును. అతడు చేయునదంతయు సఫలమగును" (కీర్తన 1:2,3).

- U. స్టాలిన్, గుత్తినదీవి

## బైబిలు దైవప్రేరితమై యున్నది

### ( The Bible is Inspired by God )

అపొస్తలుడైన పౌలు తిమోతికి యీ విధముగా వ్రాస్తున్నాడు: "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై ఉన్నది" (2తిమోతి 3:16-17). బైబిలు ఏ విధమైన లోపములేని ( Infallible) సంపూర్ణమైన (Plenary) అక్షరసంబంధమైన ( Verbally ) దేవునిచేత ప్రేరేపింపబడిన (In spired ) దేవుని వాక్యమై ఉన్నది ( The Word of God ).

బైబిలు దేవుని సంకల్పమా లేక మానవ కల్పితమా అని ప్రశ్నించుకుందాం. మానవ కల్పితమైనదైతే అది దేవుని సంకల్పముకాదు. ఇందు విషయమై పేతురు యీ విధముగా తెలియజేస్తున్నాడు: "ఒకడు తన ఊహను బట్టి చెప్పుటవలన లేఖనములలో ఏ ప్రవచనము పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనమెప్పుడును మనుష్యుని యిచ్ఛను బట్టి కలుగులేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగా పలికిరి" (2పేతురు 1:20,21). దీనిని బట్టి బైబిలు దేవుని సంకల్పమని మానవులు గ్రహించాలి.

అపొస్తలుడైన పౌలు మరీ అధికారికముగా యిలా వ్రాస్తున్నాడు. తాను మాట్లాడుచున్న ప్రతి మాట, వ్రాయుచున్న ప్రతి వాక్యము దేవుని యొక్క ఆజ్ఞయై వున్నదంటు కొరింథులో వున్న సంఘానికి యిలా వ్రాస్తున్నాడు. "ఎవడైనను తాను ప్రవక్తనని యైనను, ఆత్మ సంబంధినని యైనను తలంచుకొనిన యెడల, నేను మీకు వ్రాయుచున్నవి ప్రభువు యొక్క ఆజ్ఞలని అతడు దృఢముగా తెలిసికొన వలెను" (1కొరింథీ 4:37). మరియు పౌలు థెస్సలోనీకయుల సంఘమునకు యీ విధముగా వ్రాస్తున్నాడు: "ఆ హేతువు చేతను, మీరు దేవుని గూర్చిన వర్తమానము మావలన అంగీకరించినప్పుడు, మనుష్యుల వాక్యమని యెంచక అది నిజముగా వున్నట్టు దేవుని వాక్యమని దానిని అంగీకరించిరి గనుక మేమును మానక దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. ఆ వాక్యము విశ్వాసులైన మీలో కార్య సిద్ధి కలుగజేయుచున్నది" (1థెస్స 2:13). మరియు పౌలు ఎఫెస్సులో నున్న సంఘమునకు యిలా వ్రాస్తున్నాడు: "ఎట్లనగా-క్రీస్తు మర్మము దేవదర్శనము వలన నాకు తెలియ పరచబడినదను సంగతిని గూర్చి మునుపు సంక్షేపముగా వ్రాసితిని. మీరు దానిని చదివిన యెడల దానిని బట్టి ఆ క్రీస్తు మర్మమును గూర్చి నాకు కలిగిన జ్ఞానము గ్రహించుకొనగలరు (ఎఫెసీ 3:3-4).

మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు వారు కూడా బైబిలు దేవునివాక్యమని దృఢపరచుచున్నారు. మరియు క్రీస్తు వారు పాతనిబంధన గ్రంధమంతా కూడా దైవప్రేరితమైనదనే అంటున్నారు. "అంతట ఆయన మోషే ధర్మశాస్త్రములోను, ప్రవక్తల గ్రంధములలోను, కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడినవన్నియు,

నెరవేరవలెనని నేను మీ యొద్ద ఉండినప్పుడు మీతో చెప్పిన మాటలు నెరవేరినవని వారితో చెప్పెను" (లూకా 24:44). నూతననిబంధన వ్రాయకపూర్వమే దానికి సంబంధించిన సందేశమును, దేవుడు ముందుగా పంపిచినట్లు క్రీస్తువారు మనకు తెలియజేస్తున్నారు. ఈవిషయాన్ని క్రీస్తువారు ఆయన శిష్యులకు యిలా తెలియ జేస్తున్నారు. "అయితే ఆయన అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించుచు, ఆయన తనంతట తానే యేమియు భోదింపక, వేటిని వినునో వాటిని భోధించి, సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహాను 16:13).

ప్రేరణ వలన సంగీత యుక్తమగు సాహిత్యము వచ్చును, అదే విధమయిన ప్రేరణ వలన "బైబిలు" వచ్చిందని కొందరు దురభిప్రాయపడుచున్నారు. కన్‌ఫూజియన్ లేక షేక్స్పియర్ లాంటి మేధావులైన మానవులు ప్రేరణతో బైబిలు వ్రాసి వుంటారని మరికొందరు అభిప్రాయపడుచున్నారు. ఈవిధమైన అభిప్రాయములే నిజమైతే అన్ని పుస్తకములులాగే బైబిలు కూడా చాలా సాధారణమైన పుస్తకమై వుండును. దేవుడు బైబిలు లేఖకులకు ఆలోచన మాత్రమే కాకుండా, ఆ ఆలోచననుఏవిధమైన మాటల రూపములో బయలు పరచాలో తెలియజేసారు. ఈ యధార్ధమును యీ క్రింది లేఖనములను పరిశీలించుట ద్వారా మనము గ్రహించ గలము.

"అప్పుడు యెహోవా చేయిచాపి నానోరు ముట్టి యీలాగు సెలవిచ్చెను. ఇదిగో నేను నీనోట నా మాటలు ఉంచియున్నాను" (యిర్మీ 1:9). "కాబట్టి వెళ్లుము నేను నీనోటికి తోడైయుండి నీవు ఏమిపలకవలసినది నీకు బోధించెదనని అతనితో చెప్పెను" (నిర్గమ 4:12). "యెహోవా ఆత్మ నాద్వారా పలుకుచున్నాడు ఆయన వాక్కు నానోట ఉన్నది" (2సమూయేలు 23:2). "ఈ పత్రిక మూలముగా మేము చెప్పిన మాటకు ఎవడైనను లోబడని యెడల అతనిని కనిపెట్టి అతడు సిగ్గుపడు నిమిత్తము అతనితో సాంగత్యము చేయకుడి" (2థెస్స 3:14). అంతేకాదు గలతీయలో నున్న సంఘములకు కూడా పౌలు యిట్లు వ్రాసెను: "అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానము చేయబడెను, ఆయన అనేకులను గూర్చి

అన్నట్లు సంతానములకును అనిచెప్పక ఒకని గూర్చి అన్నట్టే నీ సంతానమునకును అనెను. ఆసంతానము క్రీస్తు" (గలతీ 3:16).

దేవుని వాక్యమునకు మనము కలుపకూడదు, దానినుండి తీసివేయకూడదు. దాన్ని ఏవిధముగాను మార్పుచేయరాదు. ఈ విషయాన్ని ఈ క్రింది లేఖనములు ఋజువుచేయుచున్నవి.

"మీ దేవుడైన యెహోవా యిచ్చిన ఆజ్ఞలను మీకాజ్ఞాపించుచున్నాను. వాటిని గైకొనుటయందు నేను మీ కాజ్ఞాపించిన మాటలతో దేనిని కలుపకూడదు. దానిలో నుండి దేనిని తీసివేయకూడదు" (ద్వితీ 4:2). 'క్రీస్తు కృపనుబట్టిమిమ్మును పిలిచిన వానిని విడిచి, భిన్నమైన సువార్త తట్టుకు మీరింత త్వరగా తిరిగి పోవుట చూడగా నాకాశ్చర్యమగుచున్నది. అది మరియొక సువార్తకాదుగాని క్రీస్తు సువార్తను చెరుపగోరి మిమ్మును కలవరపరచువారు కొందరున్నారు. మేము మీకుప్రకటించిన సువార్తకాక మరియొక సువార్తను మేమైనను పరలోకమునుండి వచ్చిన దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక. మేమిదివరకు చెప్పిన ప్రకారమిప్పుడును మరల చెప్పుచున్నాము. మీరు అంగీకరించిన సువార్తగాక మరియొకటి యెవడైనను మీకు ప్రకటించిన యెడలవాడు శాపగ్రస్తుడవును గాక" (గలతీ1:6-9). "ఈ గ్రంథమందున్న ప్రవచన వాక్యములను విను ప్రతివానికి నేను సాక్ష్యమిచ్చునది ఏమనగా-ఎవడైనను వాటితో మరిఏదైనను కలిపిన యెడల ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్లు దేవుడు వానికి కలుగజేయును, ఎవడైనను ఈ ప్రవచన గ్రంథమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసిన యెడల దేవుడు ఈ గ్రంథములో వ్రాయబడిన జీవవృక్షములోను పరిశుద్ధ పట్టణములోను వానికి పాలు లేకుండా చేయును" (ప్రక 22:18,19).

ప్రారంభములో హెబ్రీభాషలో వ్రాయబడిన పరిశుద్ధ గ్రంథము ఏ విధమైన దోషములేకుండా యితర భాషలలోనికి అనువదింపబడెను. అదే విధముగా ప్రారంభము నందు గ్రీకుభాషలో వ్రాయబడిన క్రొత్తనిబంధన గ్రంథముకూడా దోషరహితముగా యితర భాషలలోనికి అనువదింపడెను.

దైవప్రేరణ మేరకు బయల్పడిన బైబిలు గ్రంథమంతయు మన ఆధ్యాత్మిక జీవనానికి ఎంతగానో తోడ్పడుచున్నది. అందునిమిత్తమై అపొస్తలుడైన పేతురు యీ విధముగా వ్రాస్తున్నాడు: "తన మహిమను బట్టియు, గుణాతిశయమును బట్టియు మనలను పిలిచిన వాని గూర్చిన అనుభవజ్ఞాన మూలముగా ఆయన దైవశక్తి , జీవమునకును భక్తికిని కావలసిన వాటినన్నింటిని మనకు దయచేయు చున్నందున దేవుని గూర్చినట్టియు, మనప్రభువైన యేసును గూర్చినట్టియునైన అనుభవజ్ఞానము వలన మీకు కృపయు సమాధానమును విస్తరించునుగాక" (2పేతురు 1:2-3).

అంత్యదినమందు తీర్పు బైబిలుననుసరించియే జరుగును. అందుకు కావలసిన ఋజావు యీ లే ఖనములో చూడవచ్చును. "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పుతీర్చును" (యోహా 12:48).

- జాన్ గ్రబ్.

## లూదియ: ఐరోపాలో మొదటి క్రైస్తవురాలు
### (Lydia, the first Christian in Europe)
### స్త్రీ యొక్క ధైర్యము, ప్రభావముల మాదిరి

లూదియ, ఫిలిప్పయి పట్టములో వ్యాపారము చేసుకొను ఒక స్త్రీ. అయితే తన తలిదండ్రుల మతమును విడనాడి ఆమె క్రైస్తవు రాలయ్యింది. దానికి కారణం? ఐరోపాఖండం అంతటిలోను ఆనాడు ఒక్క క్రైస్తవుడు కూడా లేనిరోజుల్లో ఆమె క్రైస్తవ్యములోనికి ఎందుకు మార్పు చెందినది? ఈలోకంలో అనేకుల నిందలు తప్ప ఆమెకు కలిగేది యేమీ లేదు. ఆయినను ఆమె క్రీస్తు సువార్తను వినిన తోడనే మార్పు చెందినది. ఆమెకున్న విశ్వాసం, ధైర్యం గొప్పవి.అయితే మొదటి శతాబ్దములోను, ఇరవయ్యో శతాబ్దము లోను కూడా మానవుల కింపుగా లేకపోయినా దేవునికి ఇంపుగా వుండేవాటిని చేయుటకు సిద్ధపడియున్న స్త్రీలు అనేకమంది యున్నారు. క్రీస్తు సువార్త పాపమునుండి విమోచనను, పరలోకంలో

నిత్యజీవమును ప్రసాదించునని మనం గ్రహించగానే, ప్రజలు ఎందుకు మార్పు జెందుదురో మనం గ్రహించుకోగలము.

లూదియ మార్పు చెందుటను గూర్చి బైబిలులో అపొస్తలుల కార్యములు 16:9-15లో వ్రాయబడియున్నది. ఆమె భక్తి పరురాలు. యూదుల సబ్బాతు నాచరించుటకుగాను ఆరోజు ఆమె పని మానివేసింది. తన నిష్కాపట్యాన్ని రుజావు చేసింది. యేసుక్రీస్తును గూర్చి తెలిసికొనక పోయినను మేలైన దానిని చేయనెంచు కొన్నది. అయినను ఆమె తన పాపముల క్షమాపణను పొందలేదు. దేవుడు ఆమె హృదయమును గమనించారు. గనుక క్రీస్తును గూర్చి, ఆయన యందున్నరక్షణను గూర్చి ఆమెకు బోధించుటకు ఆయన పౌలును, సీలను ఫిలిప్పియికి పంపారు. ఆమె, ఆమె కుటుంబము వారు వెంటనే బాప్తిస్మము పొందిరి.

"అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవు చున్నారని" దేవుని వాక్యం మనకు చెబుతున్నది (రోమా 3:23). దేవుని ఆజ్ఞాతిక్రమమే పాపము (1యోహాను 3:4). దేవుడు చేయవద్దన్నది చేయడం, చేయమన్నది చేయకపోవడం పాపం. మానవులు భక్తిమార్గములోను, నైతిక మార్గములోను తమ యిష్టము వచ్చినట్లు తొలగి పోవుట పాపము (యెష 53:6; 2యోహాను 1:9). మనందరము ఏదో రీతిగా పాపము చేసిన వారమే.అందువలన మనందరికీ క్షమాపణ అవుసరం. మన పాపముల ప్రాశ్చిత్తముమనం చెల్లించలేము గనుక దేవుడు క్రీస్తును పరమునుండి భూమికి పంపించి, సిలువపై ఆయనను బలియిచ్చి మన పాప ప్రాయశ్చిత్తమును చెల్లించెను (రోమా 5:8; హెబ్రీ 2:9).

## సువర్తమానము

క్రీస్తు యొక్క సందేశము, ఆయన మనకు రక్షణను, నిత్యజీవాన్ని ప్రసాదించుచున్నాడను వర్తమానము సువార్తయని పిలువబడుచున్నది. యిది అన్ని జనాంగములకు, సర్వలోకానికి సువార్తయే.

యేసుక్రీస్తే రక్షకుడని, వాగ్దానము చేయబడిన మెస్సీయ ఆయనే యని లూదియ నమ్మినది. ఆమె తరువాత కొన్ని కోట్లమంది నమ్ముచునే యున్నారు.

ఆయనకు లోబడుచునే యున్నారు. క్రీస్తు సిలువపై చనిపోవుటద్వారా సంపాదించిన రక్షణను వారు కూడా పొందాలను కొన్నారు. ఆయన సిద్ధపరచడానికి వెళ్లిన పరలోకంలో వారొక నివాసము ఏర్పరచుకొన దలచారు (యోహాను 14:1-3).

మరణము ద్వారా క్రీస్తు పాపముల క్రయధనమును చెల్లించారు. క్రీస్తు నిత్యత్వము నుండి దేవునితోనే యుండెను. ఆయన దేవునితో సమానుడై యుండెను (ఫిలిప్పీ 2:6; యోహాను 1:1-3; ఆది.కా. 1:26).

ఆయన "సశరీరుడుగా ప్రత్యక్షమైన దేవుడు" (1తిమో 3:16; హెబ్రీ 1:8). ఆయన పూర్ణముగా దైవస్వరూపుడైన యెడల మృతిజెందక యుండును. అందువలన ఆయన మానవావతారమెత్తి సిలువపై మరణించాలని దేవుని సంకల్పమై యుండెను, మరణించుట ద్వారా మానవజాతి యొక్క పాపముల మూల్య మంతటిని ఆయన చెల్లించెను (రోమా 5:8; 2కొరింథీ 5:21).

దేవుడు యిదివరలో వాగ్దానము చేసిన దానినంతటినీ యేసు నెరవేర్చెను! ఆయన ఒక కన్యకు జన్మించునని యెషయా 7:14లో ప్రవచింపబడెను. ఆయన బేత్లెహేములో జన్మించునని మీకా 5:2లో ప్రవచింపబడెను. యివి నెరవేరు సమయం ఆసన్నమయ్యేసరికి దేవుడు గబ్రియేలు అను దూతను, కన్యయైన మరియ యొద్దకు పంపి ఆమె దేవుని కుమారునికి జనన మియ్య బోవుచున్నదని తెలియజేసెను. అదే సంగతులను ఆమెను ప్రదానము చేసుకొనిన యోసేపుకు కూడా దేవదూత తెలియజేసెను (లూకా 1:26-35; మత్తయి 1:18-25). క్రీస్తు పరలోకమును వీడు సమయం వచ్చినప్పుడు "దేవుని దూతలందరు ఆయనకు నమస్కారము చేయవలెనని" దేవుడు వారినాజ్ఞాపించెను (హెబ్రీ 1:6). ఆయన భూమిమీద జన్మించిన రాత్రివేళ గొర్రెల కాపరుల యొద్దకు దేవుని దూత వెళ్లి, ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయు చున్నాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు" అని ప్రకటించెను (లూకా 2:10-11).

యేసు జనన విధానము లూకా 2:1-16లోను మరియు మత్తయి 1:21-25లోను లిఖించబడియున్నది. యేసు సువార్త ప్రకటింప మొదలిడకముందు

యోహానుచే యొర్దాను నదిలో బాప్తిస్మము పొందెను. ఆయన నీటిలోనుండి వెడలి వచ్చినప్పుడు, దేవుడు ఆకాశమునుండి, ఇదిగో ఈయన నా ప్రియకుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నాను; ఈయన మాటవినుడి" యని ప్రకటించెను (మత్తయి 17:5).

## భక్తిగల స్త్రీలు యేసును వెంబడించిరి

మగ్దలేనే మరియ, యోహన్న, సూసన్న యను స్త్రీలును, మరికొందరును ఆయనను వెంబడించి ఆయనకు ఉపచారము చేసిరి (లూకా 8:2-3). ఆయన సిలువ వేయబడినప్పుడు కూడ భక్తిగల స్త్రీలు సిలువవరకు ఆయన వెంటవెళ్లి, సమాధి చేయబడు వరకు ఆయనతో యుండిరి.

ఆనాటి మతగురువులు ప్రజలను రెచ్చగొట్టి సిలువ వేయుము, సిలువ వేయుము అని ఆయనను గూర్చి గగ్గోలము రేకెత్తించిరి. వారాయనను మేకులతో సిలువకు కొట్టుటకు కొనిపోయినప్పుడు నమ్మకమైన స్త్రీలు ఆయన వెంటనే యుండిరి. ఆయన మరణించిన తరువాత నమ్మకమైన స్త్రీలు అరిమతయి యోసేపు సమాధిలో ఆయన ఉంచబడు వరకు ఆయన వెంట యుండిరి (లూకా 23:55). ఆయన పునరుత్థానుడైన తరువాత ఆయనను మొదట చూచిన వారును స్త్రీలే (లూకా 24:1-8; యోహాను 20:1-18). పునరుత్థానుడైన ప్రభువును గూర్చిన వార్తను మొదట యితరులకు తెలియజెప్పిన వారు కూడా స్త్రీలే (లూకా 24:10-12). నాటినుండి గడచిన శతాబ్దములలో స్త్రీలు రక్షకుని గూర్చి అనేకులకు తెలియజేసియుండిరి.

## పునరుత్థానమును గూర్చి ప్రశ్నింపతగని రుజువు

క్రీస్తు పునరుత్థానుడైన తరువాత ఆయన ఆరోహణముకాక ముందు యున్న నలువది దినములలో ఆయన "అనేక ప్రమాణము లను చూపి తన్నుతాను సజీవునిగా కనుపరచుకొనెను" (అపొ.కా. 1:3). కొందరు తమ కండ్లను తామే నమ్మలేకపోయిరి. యేసు సిలువ మీద చనిపోవడం వారు చూచారు. ఆయన సిలువపై చనిపోయి యుండుట సైనికులు చూచి ఆయన ప్రక్కలో బల్లెముతో

పొడివగా నీరును రక్తమును కారినట్లు వారెరుగుదురు (యోహాను 19:31-35). అందువలన వారు పునరుత్థానుడైన రక్షకుని కండ్లారా చూచినప్పుడు అది ఆయనఆత్మయని కొందరు తలంచారు. అందుకాయన, "నేనే ఆయనను అనుటకు నా చేతులను నా పాదములను చూడుడి; నన్ను పట్టి చూడుడి, నాకున్నట్టుగా మీరు చూచుచున్న యెముకలును మాంసమును భూతమున కుండవని చెప్పి తన చేతులను పాదములను వారికి చూపెను.... వారు కాల్చిన చేపముక్కను ఆయన కిచ్చిరి. ఆయన దానిని తీసికొని వారి యెదుట భుజించెను" (లూకా 24:36-46).

యేసు శిష్యులలో ఒకడైన తోమా ఆయనను చూచువరకు, తాకువరకు ఆయన తిరిగి లేచెనని నమ్మకుండెను. అయితే ఆయన తోమాను చూచి, "నీ వేలు ఇటు చాచి నా చేతులు చూడుము; నీ చెయ్యి చాచి నా ప్రక్కలో ఉంచి, అవిశ్వాసివి కాక విశ్వాసివై యుండుము" అని చెప్పెను. "అందుకు తోమా ఆయనతో -నా ప్రభువా, నా దేవా అనెను" (యోహాను 20:26-31). తోమాయే క్రీస్తు సువార్తను మొదట భారతదేశములో ప్రకటించెనని చరిత్ర చెబుతున్నది. ఆయన ఒకేసారి 500 మందికి పైగా కనబడెనని పౌలు చెప్పుచున్నాడు. 500మందికి పైగా యున్న ప్రత్యక్షసాక్షులు!

## క్రీస్తు పరమున కారోహణ మాయెను

ఆయన పునరుత్థానుడైన నలుబది దినముల తరువాత క్రీస్తు పరమందున్న తండ్రి యొద్దకు ఆరోహణమాయెను. ఆయన ఆరోహణ మగుచుండగా అపొస్తలులు తేరిచూచిరి, ఆయన ఏ రీతిగా వెళ్లెనో అదే రీతిగా తిరిగి వచ్చునని దూతలు ప్రకటించిరి (అపొ.కా. 1:9:11). ఆయన ఆరోహణుడు కాకమందు అపొస్తలుల కాజ్ఞాపించెనని అపొ.కా. 1:2, 3లో మనకు చెప్పబడినది. మత్తయి, మార్కు, లూకా అనువారు ఆ సమయమందు యేసుచెప్పిన ఆజ్ఞలను లిఖించిరి. అవి గొప్ప ఆజ్ఞ యని పిలువ బడెను.

## గొప్ప ఆజ్ఞ

"కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మని యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని" ఆయన వారితో చెప్పెను (మత్తయి 28:19-20)."క్రీస్తు శ్రమపడి మూడవదినమున మృతులలోనుండి లేచుననియు యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింప బడుననియు వ్రాయబడి యున్నది" (లూకా 24:46-47). "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్షవిధింపబడును" (మార్కు 16:15-16).

## క్రీస్తు అనుచరులు చేయవలసినవి

1. వెళ్లి బోధించాలి (శిష్యులనుగా చేయాలి): వారి యజమాను డైన క్రీస్తును వెంబడించులాగున శిష్యులనుగా చేయాలి. సమస్త జనాంగములకు, సర్వసృష్టికి అనగా స్త్రీ పురుషు లందరికి సువార్త బోధించాలి.

2. బాప్తిస్మమియ్యాలి: బోధింపబడిన వాకి, క్రీస్తును వెంబడించుటకు నిశ్చయించుకొనిన వారికి బాప్తిస్మ మియ్యాలి. పసి పిల్లలకు బాప్తిస్మమియ్యాల్లనే ఆజ్ఞగాని ఉదాహరణ గాని ఎక్కడాలేదు. వారికి పాపము లేనందున బాప్తిస్మమక్కరలేదు. పాపము వారసత్వము వలన సంక్ర మించదు (యెహెజ్కేలు 18:20). ప్రతివాని అంతరంగము లో జీవాత్మను సృజించువాడు యెహోవాయే. అది పవిత్రమైనది (జెకర్యా 12:1; హెబ్రీ 12:9).

3. బాప్తిస్మమిచ్చిన తరువాత కూడ బోధించాలి: ఆయన ఏయే సంగతులు గైకొనవలెనని బోధించెనో వాటన్నిటిని బాప్తిస్మము పొందిన వారికి బోధించాలి.

## రక్షింపబడడానికి యేమి చేయాలి ?

ఒకడు క్రైస్తవుడు కావలెనంటే దిగువ సంగతులు చేయాలని క్రీస్తు ఆజ్ఞాపించెను:

1. విశ్వాసము: దేవుని యందును, యేసునందును విశ్వాస ముంచాలి. యేసు దేవుని కుమారుడని నమ్మాలి. ఈ విశ్వాసము క్రీస్తును గూర్చి వినుట వలన కలుగును (రోమా 10:17; రోమా 1:16; యోహాను 6:45).

2. మారుమనస్సు: నీవు చేసిన తప్పిదములను గూర్చి మనస్సు మార్చుకొని యేసును వెంబడించుటకు నిశ్చయించు కొనుటయే మారుమనస్సు. ఆయన శిష్యుడుగా యుండుటకు చేసుకొనిన నిర్ణయమది. శిష్యుడు ఆయన యొద్ద నేర్చుకొనుచు ఆయన చెప్పినట్లు చేయును (లూకా 24:47). యేసు మారుమనస్సుతో పాపక్షమాపణను కలిపినట్లు గమనించుము.

3. ఒప్పుకోలు: మారుమనస్సు పొందినవాడు ప్రభువును గూర్చి తన హృదయములోనున్న విశ్వాసమును నోటితో ఒప్పుకోవాలి. అతడు మనుష్యుల యెదుట తన పాపములను కాదుగాని క్రీస్తునందలి తన విశ్వాసమును ఒప్పుకోవాలి (రోమా 10:9,10; మత్తయి 10:32; ఫిలిప్పీ 2:11).

4. బాప్తిస్మము పొందాలి: ఒకడు రక్షింపబడవలెనంటే నమ్మి బాప్తిస్మము పొందాలని యేసు ఆజ్ఞాపించెను (మార్కు 16:16; 1పేతురు 3:21; అపొ.కా. 22:16). బాప్తిస్మమనగా నీటిలో ముంచబడాలి (రోమా 6:4; మత్తయి 3:16; అపొ.కా. 8:38-39).

### ఈ గొప్ప ఆజ్ఞ అమలును అపొస్తలుల కార్యముల గ్రంథము తెలియజేయుచున్నది

అపొస్తలులు, మిగతా క్రైస్తవులు సిలువ వేయబడి తిరిగి లేచిన రక్షకుని గూర్చిన సువార్తను ప్రకటించిరి. నిష్కపట హృదయం గలవారు విని, విశ్వసించి, యేసును వెంబడించుటకు నిశ్చయించు కొని బాప్తిస్మము పొందిరి.

| | | |
|---|---|---|
| అపొ.కా. 2:36-41 | - | ఇంచుమించు మూడువేల మంది. సంఘారంభరోజు |
| అపొ.కా. 8:5-12 | - | సమరయలో స్త్రీలు, పురుషులు |
| అపొ.కా. 8:26-39 | - | ఐతియోపీయ ఘనుడు.కందాకేరాణి ఆర్థికమంత్రి |
| అపొ.కా. 9:1-18 | | |
| 22:16 | - | పౌలుగా మారిన సౌలు |
| అపొ.కా. 10:1-48 | | |
| 11:1-18 | - | కొర్నేలీ, అతని యింటివారు (అన్యులు) |
| అపొ.కా. 16:9-15 | - | లూదియ, ఆమె యింటివారు ఐరోపాలో మొదటివారు |
| అపొ.కా. 16::23-34 | - | ఫిలిప్పియి చెరసాల అధిపతి, అతని యింటివారు - అర్ధరాత్రి వేళ |
| అపొ.కా. 18:8 | - | కొరింథీయులలో అనేకులు |
| అపొ.కా. 19:1-5 | - | ఎఫెసులో 12మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. |

## యేమి చేయాలో చెప్పు ఆజ్ఞలు, ఉదాహరణలు

క్రొత్తనిబంధనలో అపొస్తలుల కార్యముల తరువాత వ్రాయబడిన పుస్తకములన్నియు క్రైస్తవులకొరకే వ్రాయబడెను. బాప్తిస్మము పొందిన తరువాత, క్రీస్తు ఆజ్ఞాపించిన విధులన్నియు చేయవలెనని ప్రజలకు ఆజ్ఞాపింపబడినది. వారు సమాజముగా కూడి ఆరాధించాలని బోధింపబడిరి. అపొ.కా. 2:41-42; 20:7; హెబ్రీ 10:25; ఎఫెసీ 5:19; హెబ్రీ 13:15.

నీతియు భక్తియుగల జీవితమును జీవించాలని బోధింపబడిరి. శరీరకార్యములను విసర్జించి ఆత్మఫలములు ఫలించాలని బోధింపబడిరి. గలతీ 5:19-22; తీతు 2:12; రోమా 6:3-11; ఎఫెసీ 4:22-32; 5:1-8; 2పేతురు 1:7-9.

భార్యాభర్తలు ఒండొరుల యెడల ఎట్లు ప్రవర్తించాలో చెప్పబడిరి. ఆత్మఫలములతో కూడిన వారి జీవితాలను బట్టి క్రైస్తవ గృహములు ఆనందనిలయములగును. ఎఫెసీ 5:21-33; 1పేతురు 3:1-7; కొలస్స 3:18-21; 2కొరింథీ 7:1-11.

రక్షింపబడిన వారందిరినీ క్రీస్తే తన సంఘముతో చేర్చునని వారికి బోధింపబడెను (అపొ.కా. 2:41, 47). వారు వివిధ శాఖలుగా విడిపోక అందరు ఏకమై యుండాలని వారికి బోధింపబడెను. 1కొరింథీ 1:10-12; ఎఫెసీ 4:3-6; 1కొరింథీ 3:3-4; రోమా 16:16; ఎఫెసీ 5:23-27.

## అధికారవాక్కు - క్రొత్తనిబంధన

క్రీస్తురాకమునుపు ప్రజలు పాతనిబంధనను బట్టి నడుచు కొనిరి. క్రీస్తు మరణించిన తరువాత క్రొత్తనిబంధనయే దేవుని అధికారయుక్తమైన వాక్కు (హెబ్రీ 7:12; 8:13; 10:9-10; రోమా 7:3-4). క్రైస్తవ్యము క్రొత్తనిబంధన మతము. సంఘూరాధన, నిర్మాణ పద్ధతి వగయిరా అన్నీ క్రొత్తనిబంధనను బట్టియే యుండవలెను.

క్రొత్తనిబంధన స్త్రీలకు గొప్ప ప్రాధాన్యత యిచ్చుచున్నది. వారు ఒండొరుల యెడల యెట్టి అనురాగము కలిగి యుండాలో అది చెప్పుచున్నది. మరియు స్త్రీ పురుషులిద్దరు జీవమునకు వారసులని అది చెప్పుచున్నది (1పేతురు 3:7). అయినను, పురుషులే ఆరాధనలో నాయకత్వము వహించాలని క్రొత్త నిబంధన ఆదేశించుచున్నది. పురుషులున్న సమావేశములలో స్త్రీలు వాక్యోపదేశము గాని, బోధించుటగాని చేయతగదు అని అది చెప్పుచున్నది (1తిమోతి 2:10-12; 1కొరింథీ 14:34-37). అయినను పౌలు సువార్త పనిలో తనతో సహకరించిన స్త్రీలను గూర్చి చెబుతాడు (ఫిలిప్పీ 4:3). స్త్రీలు యితర స్త్రీలకు బోధించుటలో గొప్పగా సహకరిస్తారు. పురుషులు ప్రవేశించ వీలులేని గృహాల్లో స్త్రీలు వెళ్లి సువార్త బోధించుటకు అవకాశము దొరుకును.

క్రీస్తు ఎంత గొప్పవాడో, ఆయన యిచ్చు రక్షణ ఎంత గొప్పదో మనం గమనించినప్పుడు, లూదియ వెంటనే ఆయనకు ఎందుకు లోబడిందో గమనించగలము! క్రీస్తుయొక్కయు ఆయన వాగ్దానము యొక్కయు గొప్పతనము వలన నేటికిని అక్షలాది ప్రజలు లోబడుచునే యున్నారు. ఇండియా, నేపాల్, బంగ్లాదేశ్‌లాంటి దేశములలో కూడ క్రీస్తుకు లోబడుచున్నవారు లక్షలకొలది యున్నారు. తమ బంధు మిత్రులు వారికి వ్యతిరేకులవుచున్నను వారు క్రీస్తుకు

లోబడు చున్నారు. కొందరు విగ్రహపూజనుండి క్రీస్తు వైపు మరలుచున్నారు. మరికొందరు మతశాఖలనుండి క్రీస్తువైపు ఆయన సంఘము వైపు మరలుచున్నారు. క్రీస్తుయెడలను సత్యము యెడలను వారికున్న ప్రేమను బట్టి మానవులనుండి వారు తిరస్కారము నొందినను క్రైస్తవులగు చున్నారు. కొందరు బాధింపబడిరి. మరికొందరు ఇంటినుండి వెళ్లగొట్టబడిరి. అయినను ఎన్ని కష్టములు వచ్చినా, వారు క్రీస్తు చిత్తమునకు లోబడుచునే యున్నారు. క్రీస్తుతో నిత్యగృహములో గడుపుటకు ఇక్కడ ఎన్ని కష్టములైనా అనుభవింపవచ్చును.

## క్రైస్తవ స్త్రీల యొక్క ప్రభావము నిజముగా గొప్పది

తిమోతి యొక్క అవ్వయైన లోయి, తల్లియైన యునీకేలాంటి స్త్రీలు నేటి ప్రపంచములో కూడా యున్నారు (2తిమోతి 1:5). వారి కుటుంబములపై వారి ప్రభావము చాల గొప్పది. ఫీబేలాంటి స్త్రీలు నేటికిని సువార్తికులను ప్రోత్సాహించు చున్నారు (రోమా 16:1-2). ప్రిస్కిల్ల లాంటి స్త్రీలు సంఘారాధనలకు నేటికిని తమ గృహములను తెరచియుంచు చున్నారు. (రోమా 16:4-5). త్రుపైనాకు, త్రుఫోసాకు లాంటి స్త్రీలు నేటికిని ప్రభువునందు ప్రయాస పడుచున్నారు (రోమా 16:12). అపొ.కా. 8:4లో వలె నేటికిని అనేకమంది స్త్రీలు హింసింపబడుచున్నను, వారు ఎక్కడికి వెళ్లినా అక్కడ సువార్తను బోధించు చున్నారు. వివిధదేశాలలో యున్నవారు క్రీస్తును, పరలోక మార్గాన్ని తెలిసికొనుటకు సహాయపడుచున్న సోదర సోదరీలందరిని గూర్చి దేవునికి వందనములు. పరలోకంలో దేవునితోను, ఒండొరులతోను గడుపు దినముల కొరకు ఆశతో ఎదురు చూచుచున్నాము!!

- చార్ల్స్ & ఏన్ స్కాట్.

# 13వ ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్ మరియు
# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ బైబిలు సెమినార్

## ఆహ్వానము

తేదీలు : 1997 డిశంబరు 7 నుండి 12 వరకు
ఆదివారం నుండి శుక్రవారం వరకు

స్థలము : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ - సెమినార్ హాలు
ఫోర్డ్ స్ట్రీట్, విద్యుత్‌నగర్, కాకినాడ - 533 003.

ముఖ్యాంశము : "యేసుక్రీస్తు దేవుని కుమారుడు"
**Theme : "Jesus Christ, the Son of God "**

గత 12 సంవత్సరములుగా ఆసియా ఖండములో వేర్వేరు దేశములలో జరుగుచున్న లెక్చర్‌షిప్ ఈ సంవత్సరము భారతదేశములో పైనుదహరించిన తేదీలలో జరుగబోవు చున్నది. ఆసియాలోని 10 లేక 14 దేశములనుండి వచ్చిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సువార్తికులు "యేసుక్రీస్తు దేవుని కుమారుడు" అనే అంశముపై గొప్ప ప్రసంగముల నందించబోవుచున్నారు. మరియు భారతదేశమునుండి ఇంచుమించు అన్ని రాష్ట్రముల వారు ఇందు పాల్గొనబోవుచున్నారు. యిది మన జీవితములో సంభవింపబోవుచున్న గొప్ప ఆనందదాయకమైన సమయం, సహవాసం. గనుక ఇందులో పాల్గొనుటకు ఇప్పటినుండి సిద్ధపడండి. ప్రార్ధన చేయండి. వివరములకు ఈ దిగువ సంప్రదించండి.


నెహెమ్యా గూటం
**Convenor of the Seminar ship**
**P. O. Box. 57,**
**Kakinada - 533 001**

జాషువా గూటం
**Director of the Lecture-**
**P. O. Box. 80,**
**Kakinada - 533 001**

గారి ద్వితీయ కుమారుడు రవిబాబు గారు వందన సమర్పణ చేసిరి. ఆయన సండేస్కూలును సమర్థవంతముగా నడుపుచు, శారదాకోలనీలో యున్న సంఘమును కూడా ఆత్మీయముగా నడిపించుచున్నారు. ఆనాటి కూటము అనంతరము అందరికీ ఫలహారములు పంచిపెట్టబడెను. అందరు తమ తమ గృహములకు సంతోషముతో తిరిగి వెళ్లిరి.

సెప్టెంబరు నెల సువార్తికుల సదస్సు 30వ తేదీనకాకినాడ చిల్డ్రన్ హోమ్ కాంప్లెక్స్ తూరంగిలో ఘనంగా జరిగెను. వివిధ జిల్లాలనుండి అధిక సంఖ్యలో తరలి వచ్చిన సువార్తికుల సమక్షంలో "ధర్మవిరోధ సంబంధమైన మర్మము అనగా నేమి? అది నేడు ఎట్లు క్రియచేయు చున్నది?" (2థెస్స 2:7) అను అంశమును సోదరులు పి.ప్రకాశం, బి.ప్రసాదరావు, జి.షడ్రక్, వి.హిట్లర్, టి.వి.యన్.కుమార్, ఇ.కె.వి.ప్రసాదరావు, యన్.ఏలీయా, చుక్కా అప్పారావు, పి.జె.కృపాలిని, యస్.జాన్ మరియు జాషువా గూటం గార్లు సవిస్తరముగా చర్చించిరి.

థెస్సలోనీకయలో నున్న క్రైస్తవులను పౌలు తన పత్రికలో "ధర్మవిరోధ సంబంధమైన మర్మము"ను గూర్చి హెచ్చరించెను (2థెస్స 2:7). అది ఆంగ్లభాషలో MYSTERY OF LAWLESSNESS అని వ్రాయబడి యున్నది. "ధర్మము" అను పదము "చట్టము" అను భావంతో వ్రాయబడినది. క్రీస్తు చట్టము వాక్యమే గనుక ఎవరైతే వాక్యమునకు విరోధముగా ప్రవర్తించుదురో వారే ధర్మవిరోధులు. SIN IS LAWLESSNESS .

"ధర్మవిరోధ సంబంధమైన మర్మము ఇప్పటికే క్రియ చేయుచున్నది" యని తన కాలంలోనే పౌలు బోధించెను. ధర్మవిరోధి అంతటికి పైగా తన్నుతానే హెచ్చించుకొనును. యితడు భూసంబంధమైన వాటిని, యూదామత సంబంధమైన వాటిని సంఘము లోనికి తెచ్చును. అతడు దేవుని "ఆలయము"ను ఆక్రమించును. (2థెస్స 2:4). "ఆలయము" అను పదము పౌలు సంఘమునకు పర్యాయపదంగా అనేకసార్లు తన పత్రికలలో వ్రాసెను. సంఘమును భ్రష్టత్వమునకు నడిపించుటలో కథలిక్ పోపులు ప్రముఖపాత్ర వహించుట వలన ఈపదం వారికే వర్తించుచున్నది.

ఎవరైతే దేవుని వాక్యమునకు వేరుగా తమ స్వంత సిద్ధాంతములను ప్రకటించు చున్నారో వారే ధర్మవిరోధులు యనుటలో సందేహము లేదు. నేడు ధర్మవిరోధులు లేఖనముల ప్రాముఖ్యాన్ని, సంఘము యొక్క ఔన్నత్యాన్ని, రక్షణసంకల్పము యొక్క అవసరాన్ని నిరాకరించు చున్నారు. వీరు అపవాది సంబంధులు.

కాకినాడ చిల్డ్రన్ హోమ్ డైరక్టరు Bro. T.V.N. కుమార్ గారు, వారిసతీమణి, స్థానిక సంఘము ఈసదస్సు నిమిత్తము చక్కని ఏర్పాట్లుచేసి, జయప్రదము గావించిరి. దూరప్రాంతములనుండి వచ్చిన సువార్తికులకు భోజనపానాదులు చక్కగా ఏర్పరచిరి. ఆ దినమంతయు చల్లటివాతావరణం అనుగ్రహించిన దేవునికి అందరు స్తుతులు చెల్లించగా, సోదరులు B.లాజరస్ గారి ప్రార్ధనతో సువార్తికుల సదస్సు ముగిసెను. అక్టోబరు నెల సదస్సు 28వ తేదీ మంగళవారం నాడు, కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ (విద్యుత్‌నగర్) ఆవరణలో జరుగును.

---

Regd. No. H / KD-45 / K.D. H.O
Date of Posting : 15 th of Every month

From:
SATYA WAKKU
P.o. Box 80
KAKINADA - 533 001

To